420 హామీలకు నిధులెట్లా తెస్తరు?

మొదటిపేజీ తరువాయి...

జరిగిన చర్చ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బడ్జెట్ పుస్తకంలో రాజ్యాంగ పీఠికలు, మహానుభావుల సూక్తులను ఉటంకించారని, అసలు రాజ్యాంగ పీఠికలకు, ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు సంబంధం ఏమిటో అర్థం కాలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చినందుకు సోనియాగాంధీకి, మన్మోహన్‌సింగ్‌కు కృతజ్ఞతలు చెప్పి, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కోట్లాదిమందిని, మలిదశ ఉద్యమానికి నేతృత్వం వహించిన కేసీఆర్‌ను మర్చిపోవడం విచారకరమని పేర్కొన్నారు.



ఆరు గ్యారెంటీలకు 53,196 కోట్లేనా?

రైతు రుణమాఫీ, డిక్లరేషన్లు, అభయహస్తం కాకుండా కేవలం ఆరు గ్యారంటీలకే రూ.1.36 లక్షల కోట్లు అవసరం కాగా, బడ్జెట్‌లో రూ.53,196 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇవి ఏ మూలకూ సరిపోవని కడియం శ్రీహరి స్పష్టంచేశారు. వచ్చే ఆరు నెలల్లో కూడా ఆరు గ్యారంటీలు అమలయ్యే పరిస్థితి కనిపించడంలేదని అనుమానం వ్యక్తంచేశారు. ఎన్నికల కోడ్ పేరుతో కాలయాపన చేసి ప్రజలను మోసం చేయవచ్చనే ఆలోచనతో ఉన్నట్టు కనిపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

డొల్ల బడ్జెట్

బడ్జెట్ డొల్లగా ఉన్నదని, గత ప్రభుత్వంపై విమర్శలు, ఆరోపణలు చేసేందుకు ఎక్కువ సమయం కేటాయించారని కడియం శ్రీహరి మండిపడ్డారు. మసాలా దట్టించడం కోసం సూక్తులు రాయడం మంచిదికాదని హితవు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం కంటే బడ్జెట్ కేటాయింపులు రూ.51 వేల కోట్లు పెంచారని, వీటిని ఎలా సమకూరుస్తారని నిలదీశారు. పన్ను ఆదాయం రూ.20 వేల కోట్లు పెంచారని, ఇది ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రం అప్పులపాలైందని పేర్కొంటూనే రూ.59,625 కోట్ల అప్పులు చేస్తామని చెప్పడాన్ని తప్పుబట్టారు.

జాతీయ వృద్ధిరేటు కంటే మన వృద్ధిరేటు అధికం

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమీ చేయకపోతే 2014-15లో రూ.1.65 లక్షల కోట్లుగా ఉన్న బడ్జెట్ నేడు రూ.2.75 లక్షల కోట్లకు ఎలా పెరిగిందని కడియం శ్రీహరి నిలదీశారు. తెలంగాణ జీఎస్‌డీపీ 2014-15లో రూ.5.5 లక్షలు ఉండగా, 2023లో 14.4 లక్షలకు చేరిందని, కొవిడ్ రాకుంటే రూ.18 లక్షలకు చేరేదని వివరించారు. దేశ వృద్ధి రేటు 10.5% కంటే తెలంగాణ వృద్ధిరేటు 12.7 శాతంగా ఉన్నదని చెప్పారు. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన ఘనత కాదా? అని ప్రశ్నించారు. తలసరి ఆదాయం రూ.3,43,207తో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో ఉన్నదని, ఇది కేసీఆర్ విజయం కాదా? అని నిలదీశారు. 2004-05 నుంచి 2013-14 వరకు మూలధన వ్యయం రూ.54.52 వేల కోట్లు కాగా, ప్రస్తుతం రూ.3,36,916 కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. రాష్ట్రం అప్పులపాలైందని అంటున్నారని, అయితే అప్పుల్లో తెలంగాణ దేశంలోని 29 రాష్ట్రాల్లో 23వ స్థానంలో ఉన్నదని చెప్పారు.

మహిళలకు రూ.2,500 ప్రస్తావనే లేదు

రాష్ట్రంలో 18 ఏండ్లు నిండిన మహిళలు 1.65 కోట్ల మంది ఉన్నారని, ఇంటికి ఒక్కొక్క మహిళకు నెలకు రూ.2,500 చొప్పున ఇచ్చినా రూ.20 వేల కోట్లు అవసరమని, బడ్జెట్‌లో ఈ ప్రస్తావనే లేదని కడియం మండిపడ్డారు. రూ.4 వేల చొప్పున చేయూత పెన్షన్లు ఇచ్చేందుకు రూ.24 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల వరకు బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉంటుందని చెప్పారు. ఇండ్ల నిర్మాణానికి ఏడాదికి రూ.23వేల కోట్లు అవసరం కాగా రూ.7 వేల కోట్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు.

గత పెట్టుబడి ఒప్పందాలే మళ్లీ చేసుకున్నారా?

2014-2023 వరకు రాష్ట్రానికి రూ.2.60 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని, ఐటీ ఎగుమతులు రూ. 57,258 కోట్ల నుంచి రూ.2,41,275 కోట్లకు పెరిగాయని కడియం వివరించారు. ఇటీవల ముఖ్యమంత్రి, పరిశ్రమల మంత్రి దావోస్ పర్యటన సందర్భంగా రూ.40 వేల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగినట్టు పేర్కొన్నారని, అందులో కొన్ని గతంలోనే ఒప్పందాలు చేసుకున్నవి ఉన్నాయని వివరించారు. తాజా ఒప్పందాలు అదనపు పెట్టుబడులకు సంబంధించినవా? లేక గతంలో చేసుకున్న ఒప్పందాలే మళ్లీ చేసుకున్నారా? అని ప్రశ్నించారు.

మేడిగడ్డ బరాజ్‌కు వెంటనే మరమ్మతులు చేయాలి

మేడిగడ్డ కుంగడం విచారకరమని, దీనిపై విచారణ జరిపించి దోషులపై చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. జూన్, జూలైలో వర్షాలు, వరదలు వచ్చే అవకాశం ఉన్నదని, ఈలోగా మేడిగడ్డపై కాపర్ డ్యామ్ నిర్మించి మరమ్మతులు పూర్తిచేయాలని కోరారు. తక్షణమే మరమ్మతు పనులు చేపట్టకపోతే వరదల వల్ల మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని హెచ్చరించారు.

నిరుద్యోగభృతి, సంక్షేమం సంగతేమిటి?

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, యువత, మహిళల సంక్షేమంపై డిక్లరేషన్లు ప్రకటించినప్పటికీ వారికి కేటాయించిన నిధులు మాత్రం పెద్దగా లేవని కడియం విమర్శించారు. యువతకు రూ.4000 నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఎస్సీ, ఎస్టీలకు అభయహస్తం పేర రూ.12 లక్షల ఆర్థిక సహాయం వంటి అంశాలను బడ్జెట్‌లో ప్రస్తావించలేదని దుయ్యబట్టారు. బీసీ సబ్‌ప్లాన్ కోసం రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ కులగణను స్వాగతిస్తామని చెప్పారు. ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ, యువతకు ఇచ్చిన హామీలకు బీసీ జనగణనతో సంబంధం లేదని గుర్తుచేశారు.

చిహ్నాలు తొలగించినా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా కేసీఆర్

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామంటున్న సీఎం, తెలంగాణ ఆనవాళ్లను చెరిపే ప్రయత్నం చేస్తున్నారని కడియం ధ్వజమెత్తారు. రాష్ట్ర చిహ్నంలో ఉన్న కాకతీయుల కళాతోరణాన్ని, చార్మినార్‌ను తొలగిస్తామని చెప్పడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. 'జయజయహే తెలంగాణ' గీతంలో కూడా వీటి ప్రస్తావన ఉన్నదని గుర్తుచేశారు. వీటిని కేసీఆర్ నిర్మించలేదని, తెలంగాణకు గర్వకారణమని, వారసత్వ సంపద అని చెప్పారు. రాచరికపు ఆనవాళ్ల పేరుతో వీటిని తొలగించడం మంచిదికాదని హితవు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్ జాతిపితగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారని స్పష్టం చేశారు. సైబర్ టవర్ ఎవరు నిర్మించారంటే చంద్రబాబునాయుడి పేరు, ఔటర్ రింగురోడ్డు అనగానే వైఎస్ఆర్ పేరు చెప్తారని, అలాగే అమరవీరుల స్మారకం, అంబేద్కర్ సచివాలయం, 125 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహం, పోలీస్ కమాండ్ కంట్రోల్ తదితర వాటిని కేసీఆర్ నిర్మించారని, వీటిని ఎలా చెరిపేస్తారని ప్రశ్నించారు. కాకతీయుల కళాతోరణాన్ని తొలగించడం అంటే ప్రజలను అవమానించడమేనని చెప్పారు. హైదరాబాద్‌లో కలరా వచ్చినప్పుడు ప్రజలకు పని కల్పించడం కోసం చార్మినార్‌ను నిర్మించారని, కలరాతో చనిపోయినవారి గుర్తుగా చార్మినార్ ఉన్నదని పేర్కొన్నారు. వరసత్వ నిర్మాణాల తొలగింపుపై కాకుండా ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని హితవు చెప్పారు.

బీఆర్ఎస్ సభ్యులకు కాంగ్రెస్ అడ్డంకులు

అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చలో బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతుండగా కాంగ్రెస్ సభ్యులు పదేపదే అడ్డుతగిలారు. బీఆర్ఎస్ సభ్యుల ప్రసంగాలను అడుగడుగునా అడ్డుకుంటూ గందరగోళం సృష్టించారు. కడియం శ్రీహరి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై మాట్లాడినంతసేపూ మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ సభ్యుడు మందుల సామేల్ తదితరులు అడ్డంకులు సృష్టించారు. నిర్భందం, నియంతృత్వం గురించి బడ్జెట్ పుస్తకంలో పేర్కొన్న ప్రభుత్వం, ఎమర్జెన్సీ అంశాన్ని మాత్రం మర్చిపోయిందని కడియం శ్రీహరి వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్ సభ్యులు ఒక్కసారిగా లేచి అభ్యంతరం వ్యక్తంచేశారు.



అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు తదితరులు

హోరెత్తిన అసెంబ్లీ

మొదటిపేజీ తరువాయి...

నినాదాలు చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రతిపక్ష నేతపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ అంశంపై మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని పట్టుపట్టారు. ప్రధాన ప్రతిపక్ష నేతపై సభా నాయకుడు అడ్డగోలుగా మాట్లాడటం ఏంటని, కనీస మర్యాద, సభ్యత లేకుండా అన్‌పార్లమెంటరీ పదాలను వాడారని, ఆ పదాలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అందుకు స్పీకర్ వైపు స్పందన లేకపోవడంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. సీఎం తీరును ప్రజలకు వివరించడానికి అసెంబ్లీ మీడియా పాయింట్ వైపునకు వెళ్లడానికి ప్రయత్నించారు. బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయ సమీపంలోనే పోలీసులు, అసెంబ్లీ మార్షల్స్ బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులను అడ్డుకున్నారు. మీడియా పాయింట్ వైపు వెళ్లడానికి వీల్లేదని స్పష్టంచేశారు. సభ జరిగేటప్పుడు మీడియాపాయింట్ వద్ద మాట్లాడవద్దనే నిబంధన ఉన్నదని చీఫ్ మార్షల్ చెప్పటంతో అందుకు సంబంధించిన ఆదేశాల కాపీని చూపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. గతంలో సభ జరుగుతున్నప్పుడు మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ సభ్యులు అనేక మార్లు మాట్లాడారని గుర్తుచేశారు. కంచెలను తొలగించామని గొప్పగా చెప్తున్న ప్రభుత్వం, అసెంబ్లీ లోపలే కంచెలు వేసిందని, ఇదేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా ఇతర బీఆర్ఎస్ సభ్యులు అక్కడే కూర్చొని నిరసన తెలిపారు.

సీఎం దిగజారి మాట్లాడుతున్నారు: కడియం

సీఎం రేవంత్‌రెడ్డి దిగజారి అభ్యంతరకర భాషలో మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. కేసీఆర్ పట్ల సీఎం వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఆ పదాలు అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలని కోరుదామంటే స్పీకర్ మాకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తాము కూడా సీఎం భాషకు దీటుగా బదులివ్వగలమని, కానీ పార్లమెంటరీ సంప్రదాయాల మీద గౌరవంతో ఓపిక పడుతున్నామని తెలిపారు.

సీఎం చెప్పేదొకటి చేసేదొకటి: వేముల

తాను కూడా శాసనసభ వ్యవహారాల మంత్రిగా పనిచేశానని, అసెంబ్లీ సమావేశం నడుస్తుండగా మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు మాట్లాడవద్దనే నిబంధన ఏదీ లేదని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం కావాలనే ప్రతిపక్ష సభ్యుల గొంతు నొక్కుతున్నదని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. సీఎం చెప్పేదొకటి చేసేదొకటి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఒక్క నిమిషం మాట్లాడుతామని చెప్పినా అవకాశం ఇవ్వడంలేదు. అసెంబ్లీ ఆవరణలో సభ్యుల హక్కుపై నియంత్రణ ఎలా పెడతారు? ప్రతిపక్షాలను అణిచివేసే విధంగా అధికార పక్షం వ్యవహరిస్తున్నది. ఇదంతా సీఎం కనుసన్నల్లోనే జరుగుతున్నది' అని ఆరోపించారు.

తెలంగాణ భాషను అవమానించిన సీఎం: పల్లా

సీనియర్ ఎమ్మెల్యే, దళిత నాయకుడు కడియం శ్రీహరిపై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడిన అనుచిత భాషను వెంటనే రికార్డుల నుంచి తొలగించాలి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కడియం శ్రీహరి బడ్జెట్‌కు సంబంధం లేని విషయాలు ఎక్కడా మాట్లాడలేదని, సీఎం రేవంత్ ఇష్టమొచ్చిన భాష మాట్లాడుతూ దాన్ని తెలంగాణ భాషగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ భాషను సీఎం అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలనలో రెండు నెలల్లోనే ప్రజాస్వామ్య స్ఫూర్తి లోపించిందని, అసెంబ్లీలో కంచెల పాలన తెచ్చారని, ప్రతిపక్ష నేతల గొంతు నొక్కుతున్నారని ధ్వజమెత్తారు. అమరవీరుల స్తూపానికి, సచివాలయానికి మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా బీఫాం అందుకుంటున్న పార్టీ రాజ్యసభ అభ్యర్థి వద్దిరాజు రవిచంద్ర

రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

- కాంగ్రెస్ నుంచి రేణుక, అనిల్ యాదవ్
- బీఆర్ఎస్ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్ర
- ముగ్గురూ ఏకగ్రీవమయ్యే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ బుధవారం తమ రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించాయి. కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి, యువజన కాంగ్రెస్ నాయకుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను కాంగ్రెస్ తమ అభ్యర్థులుగా ప్రకటించగా.. బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తిరిగి ఎంపికయ్యారు. కాంగ్రెస్ నుంచి అనిల్‌కుమార్ యాదవ్ ఎంపిక మాత్రం అనూహ్యంగా జరిగింది.

వద్దిరాజుకు మరో చాన్స్

బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్రను పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. బుధవారం సాయంత్రం ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. అనంతరం వద్దిరాజుకు బీఫాం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. గతంలో బండ ప్రకాశ్ రాజీనామా వల్ల ఖాళీ అయిన రాజ్యసభ సీటు వద్దిరాజును వరించిన విషయం తెలిసిందే. 2022 మే 24న ఈ పదవికి ఎన్నికైన వద్దిరాజు కేవలం రెండేండ్లే ఎంపీగా కొనసాగడంతో ఆయనకు మరోసారి అవకాశం కల్పించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉన్న మున్నూరు కాపు వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశంతోనే వద్దిరాజుకు మరోసారి ఎంపీగా అవకాశం ఇచ్చినట్టు సమాచారం. దీంతో ఆయన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన అనంతరం ఆయన పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కవిత శుభాకాంక్షలు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇనగుర్తి గ్రామంలో 1964 మార్చి 22న జన్మించిన వద్దిరాజు.. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వరంగల్ ఈస్ట్ స్థానం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు.

బీసీ వర్గాలకు న్యాయం: గంగుల

బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజును ఎంపిక చేయడం ద్వారా పార్టీ అధినేత కేసీఆర్ బీసీ వర్గాలకు న్యాయం చేశారని మాజీ మంత్రి గంగుల కమలాకర్ హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు లభించే అవకాశమున్న ఒక్క రాజ్యసభ సీటును బీసీకి ఇవ్వడం ద్వారా ఆ సామాజిక వర్గంపై ఉన్న ప్రేమను కేసీఆర్ మరోసారి చాటుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు బీసీ వర్గాలు రుణపడి ఉంటాయని పేర్కొన్నారు.

నేడే నామినేషన్లు

నామినేషన్ల దాఖలుకు గురువారమే తుది గడువు కావడంతో వద్దిరాజుతోపాటు కాంగ్రెస్ అభ్యర్థులు రేణుకాచౌదరి, అనిల్ కుమార్ యాదవ్ కూడా నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈనెల 16న నామినేషన్‌ల పరిశీలన, 20న నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఖాళీ అయిన 3 రాజ్యసభ స్థానాలకు ముగ్గురే నామినేషన్లు దాఖలు చేసే అవకాశాలు ఉండటంతో వారి ఎన్నిక ఏకగ్రీవం కానున్నది. దీంతో వారి ఎన్నికను ప్రకటిస్తూ 20వ తేదీ సాయంత్రం ధ్రువపత్రాలు అందజేస్తారు.

ప్రధాన ప్రతిపక్షానికే తక్కువ సమయం

- ఒక్క సభ్యుడు ఉన్న సీపీఐకి గంట
- ఎంఐఎంకు 1.30 గంటలు
- మా మైక్ పదేపదే కట్ చేస్తున్నారు
- అసెంబ్లీ వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటును విరమించుకోవాలి
- ప్రధాన ప్రతిపక్షంగా నిలదీస్తాం
- మీడియాతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు సభలో మాట్లాడేందుకు అతి తక్కువ సమయం కేటాయిస్తున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ మైక్‌ను పదేపదే కట్ చేస్తున్నారని, మంత్రులు పదేపదే జోక్యం చేసుకుంటూ ప్రధాన ప్రతిపక్షం వాయిస్‌ను ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తమకు 30 నిమిషాలు సమయం కేటాయిస్తే.. ఒక్క సభ్యుడు ఉన్న సీపీఐకి గంట, ఎంఐఎంకు 1.30 గంటలు కేటాయించారని తెలిపారు. బీఆర్ఎస్‌కు ఇచ్చే సమయంలో 10-15 సార్లు మైక్ కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను ప్రస్తావిస్తామని, అధికార పార్టీని నిలదీస్తామని, అవసరమైతే పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేలు మీడియా పాయింట్‌కు పోకుండా ఏనాడూ అడ్డుకోలేదని పేర్కొన్నారు. ప్రగతిభవన్‌లో సీఎం ఉండటంలేదు కాబట్టి కంచెలు తొలగించారని, రేవంత్‌రెడ్డి ఇంటి చుట్టూ కంచెలు ఏర్పాటు చేసుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంగా ఉంటే కాంగ్రెస్ హయంలో నిందలు, శ్వేతపత్రాలు, మోసాలే నినాదాలుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ చిహ్నంలోని మూడు సింహాలు ఎవరు తీసుకొచ్చారని ప్రశ్నించారు. కాకతీయుల పాలన ఏవిధంగా ఉన్నదో అందరికీ తెలుసునని, చెరువులు, వేయిస్తంభాలగుడి, చారిత్రక, వారసత్వ సంపద ఎన్నో ఉన్నాయని గుర్తుచేశారు. చంద్రబాబు అండ్ కో చెప్పినట్టుగా రేవంత్‌రెడ్డి నిర్ణయాలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర చిహ్నం నుంచి చార్మినార్‌ను తొలగించడాన్ని ముస్లీం వ్యతిరేక చర్యగా భావిస్తున్నామని చెప్పారు. గొల్కొండ కోటలో జెండాను ఎగురవేయడాన్ని వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్.. ఢిల్లీలో ఎర్రకోటపై జాతీయజెండాను ఎగురవేసిందని గుర్తుచేశారు. సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని, అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు గత ప్రభుత్వం అన్నిరకాల ఏర్పాట్లు చేసిందని, విగ్ర హం తయారీకి ఆర్డర్ కూడా ఇచ్చామని వివరించారు. కాంగ్రెస్‌కు భావదారిద్రం తప్ప మరేమీ లేదని విమర్శించారు. దీనిని ప్రజల భావజాలం మీద, హక్కుల మీద దాడిగానే భావిస్తున్నామని చెప్పారు. దీనిపై విద్యావంతులు, మేధావులు, ఉద్యమకారులు స్పందించాలని ఆయన కోరారు. తెలంగాణతల్లిని అవమానించవద్దని ప్రభుత్వానికి హితవు చెప్పారు.

సభలోనూ అదే భాష... అదే తీరు

సీఎం రేవంత్‌పై సర్వత్రా విమర్శలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): చట్టసభలకు ఒక పవిత్రత ఉంటుంది. సభ్యులు మాట్లాడే భాషపై నియంత్రణ ఉంటుంది. అన్‌పార్లమెంటరీ భాష ఉపయోగించకూడదన్న నియమ, నిబంధనలు ఉన్నాయి. కానీ శాసనసభలో సభా నాయకుడు, మంత్రులు, అధికార కాంగ్రెస్ సభ్యులు ఇవేమీ పట్టించుకోకుండా సభా నియామావళిని ఉల్లంఘించి ఇష్టానుసారంగా ప్రతిపక్ష నాయకులను దూషించే కొత్త సంప్రదాయానికి తెరలేపారు. శాసనసభలో బుధవారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి పదేపదే చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభ నుంచి వాకౌట్ చేసే పరిస్థితికి దారితీసింది. సీనియర్ సభ్యుడు కడియం శ్రీహరి అభ్యంతరం చెప్పగా ఆయనపై కూడా మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ప్రతిపక్ష సభ్యులు కోరినా స్పందనలేక పోవటంతో విధిలేక నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు. పైగా నల్లగొండ బహిరంగ సభలో తమను కేసీఆర్ దుషించలేదా? అని పాలకపక్ష సభ్యులు సమర్థించుకోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాస్తవాలు జీర్ణించుకోలేక సభలో గందరగోళం

- సీఎం అయ్యాక కూడా రేవంత్ భాష మారలేదు
- ప్రగతిభవన్ వద్ద కంచెలు తొలగించి అసెంబ్లీలో ఏర్పాటు
- మీడియాతో కడియం శ్రీహరి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): బడ్జెట్ డొల్లతనాన్ని, కాంగ్రెస్ మోసపూరిత హామీలను అసెంబ్లీ ద్వారా ప్రజలకు తెలియజెప్పేందుకు తాము ప్రయత్నిస్తుంటే, దానిని జీర్ణించుకోలేక అసెంబ్లీలో గందరగోళం సృష్టించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆగ్రహం వ్యక్తంచేశారు. సభను పక్కదారి పట్టించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించారని మండిపడ్డారు. సీఎం అయిన తరువాత కూడా రేవంత్ వ్యవహారశైలి, భాష మారలేదని మండిపడ్డారు. బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నవారు చాలా సంయనంతో హుందాగా వ్యవహరించాలని సూచించారు. కేసీఆర్‌ను అనుచిత, అసభ్య పదజాలంతో దూషించడం సరికాదని హితవు చెప్పారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై కాకుండా రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును తీసుకొని కేసీఆర్‌ను దూషించారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరం తీవ్రంగా వ్యతిరేకిస్తూ, గట్టిగా అరిచినా, మొత్తుకున్నా అవకాశం ఇవ్వలేదని, మరొక కాంగ్రెస్ సభ్యుడికి అవకాశం ఇచ్చారని తెలిపారు. కనీసం అసెంబ్లీ అవరణలో ప్రజలకు తమ వాదన వినిపించుకుందామంటే మీడియా పాయింట్‌కు కూడా పోనివ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రగతిభవన్ ముందు కంచెలు తొలగించి, అసెంబ్లీలో తమను అడ్డుకోవడానికి కంచెలు వేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన అసభ్య పదజాలాన్ని రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను కోరామని వెల్లడించారు.

లోకం పోకడ

నీళ్ల గురించి అడిగింది మిమ్మల్ని నీళ్లు నమలమని కాదు, రైతులకు నీళ్లు ఎప్పుడిస్తారని!

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	14.2°c	37.4°c
ఖమ్మం	16.0°c	33.0°c
ఆదిలాబాద్	16.1°c	34.9°c
హైదరాబాద్	18.0°c	33.0°c
మెదక్	18.3°c	35.3°c
వరంగల్	19.0°c	32.0°c
నల్లగొండ	19.0°c	34.1°c
నిజామాబాద్	20.6°c	34.3°c
మహబూబ్‌నగర్	20.9°c	34.4°c
కరీంనగర్	21.0°c	33.0°c

తెలంగాణలో భానుడి భగభగలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా భానుడి ప్రతాపం మొదలు కానున్నదని హైదరాబాద్ వాతావరణశాఖ అంచనా వేసింది. బుధవారం నుంచి ఎండల ప్రభావం ఉంటుందని, ఈ నెల 17 నుంచి 22 వరకు రాష్ట్రమంతట